ప్రజాశక్తి
బుధవారం 29 మే 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

కొనసాగుతున్న వేడిగాలులు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు - రుతుపవనాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వేడిగాలులు కొనసాగుతున్నాయి. రోహిణీ ప్రభావంతో ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రానున్న రెండు రోజుల్లో రెండు నుంచినాలుగు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. రానున్న రెండు రోజులు వాతావరణం పొడిగా ఉంటుందని వేడిగాలులు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇందువల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రధానంగా వృద్దులు, మహిళలు,చిన్నారులు పలు ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. రుతుపవనాలు ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించడానికి ఇంకా 10 రోజుల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. రానున్న 3-4 రోజుల్లో కేరళలో రుతుపవనాలు ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని, ఇవి క్రమంగా దక్షిణ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు, కొమరిన్, మాలదీవులలోని మిగిలిన ప్రాంతాలకు, కేరళ లక్షద్వీప్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలకు, బంగాళాఖాతం పరిధిలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

రోమాల్ తుపాను తరువాత నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తుండటం వల్ల వేడి తీవ్రత పెరుగుతోంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేడి తీవ్రత కొనసాగింది. మంగళవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 18 మండలాల్లో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. అంతేగాక 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న మూడ్రోజుల్లో ఉష్ణోగ్రత 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలున్నాయని, పల్నాడు జిల్లా జంగమేశ్వరపురంలో 45 డిగ్రీలకు పైగా నమోదు కావవచ్చని అధికారులు తెలిపారు. వేడిగాలులు పెరుగుతున్నందు వల్ల షుగర్, బిపి, గుండెనొప్పి వ్యాధిగ్రస్తులు ఎండలో తిరగవద్దని వాతావరణ శాఖ సూచించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎండల తీవ్రత కొంత ఉన్నా వడగాలి తక్కువగా ఉందని ప్రస్తుతం వడగాల్పుల తీవ్రత పెరిగి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తీవ్రత నుంచి సేదతీరేందుకు శీతలపానియాలు, ఐస్‌క్రీమ్ పార్లర్లలో రద్దీ పెరిగింది. కొబ్బరి బొండాలు, జ్యూస్‌ల కొనుగోలు పెరిగింది. విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగింది. ఏసీలు, కూలర్ల వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక విద్యుత్ కోతలు అమలవుతున్నాయి.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల అధికారి, డిజిపి

లెక్కింపులో వివాదాలకు ఆస్కారమివొద్దు

- ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి
- ఏర్పాట్లపై డిజిపితో కలిసి అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని పార్లమెంటుతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 4వ తేదీన చేపట్టనున్న ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం పరిశీలించారు. నరసరావుపేట మండలం కాకాని పంచాయతీ పరిధిలో గల జెఎన్‌టియు కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రం, లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు ఇప్పటికే చేసిన, చేస్తున్న ఏర్పాట్లను, ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. తొలెత డిజిపి హరీష్ కుమార్ గుప్తా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్, ఎస్‌పి మలిక గర్గ్ తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో వివాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని, సిసి కెమరాలకు సంబంధించి సెంట్రలైజడ్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేయాలని చెప్పారు. లెక్కింపు సందర్భంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే సంబదిత రిటర్నింగ్ అధికారి వెంటనే స్పందించాలన్నారు. అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు తదితరులకు చేయాల్సిన ఏర్పాట్లతో పాటు అత్యంత కీలకమైన భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు, జాప్యం లేకుండా ఫలితాల వెల్లడికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పోలింగ్ రోజున ఇవిఎంలు ధ్వంసం చేసిన కేసుల్లో ఉన్న వారిని, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ తర్వాత రోజున హింసాత్మక ఘటనలలో పాల్గొన వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించవద్దన్నారు. డిజిపి మాట్లాడుతూ 3, 4, 5 తేదీల్లో మద్యం అమ్మకాలు నిషేదించాలన్నారు. అగ్నిమాపక

2లో

హైదరాబాద్‌లో ప్రమాదం

తెనాలికి చెందిన సోదరుల్లో ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - తెనాలి

మృతుడు మహమ్మద్ హుస్సేన్ బేగ్ (ఫైల్)

హైదరాబాదులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న అన్నదమ్ముల్లో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీ నగర్, లెనిన్ రోడ్డుకు చెందిన అన్నదమ్ముల్లో మహమ్మద్ హుస్సేన్ బేగ్ (22)

2లో

అజ్ఞాతం వీడిన పిన్నెల్లి!

నరసరావుపేటకు చేరుకున్న మాచర్ల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎట్టకేలకు అజ్ఞాతం వీడారు. ఆయనపై నమోదైన వేర్వేరు కేసుల్లో మంగళవారం రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ప్రతిరోజూ జిల్లా కేంద్రం నర్సరావుపేటలో ఎస్‌పి కార్యాలయంకు వెళ్లి సంతకం చేయాలని, మాచర్ల నియోజకవర్గంలోకి ప్రవేశించరాదని, ఎటువంటి ప్రకటనలూ ఇవ్వరాదని హైకోర్టు ఆంక్షలు విధించింది. ఈ మేరకు ఆయన మంగళవారం రాత్రి చెన్నై నుంచి నరసరావుపేట చేరుకున్నారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో నరసరావుపేటకు చేరుకున్న ఆయన ఎస్‌పి కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించారు.

2లో

కన్ను పడితే కాజేయడమే!

- వివాదంలో కార్పొరేషన్ స్థలం
- పార్కుకు కేటాయిస్తామన్న కమిషనర్
- అడ్డుపడుతున్న అధికార పార్టీ నేతలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కార్పొరేషన్ స్థలంలో అధికారులతో వాగ్వాదం

గుంటూరులోని 22వ డివిజన్‌లోని శ్రీనివాసరావుతోట 60 అడుగుల రోడ్డులో ప్రభుత్వ స్థలం కబ్జా చేసేందుకు కొంత మంది అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఒక ఆలయానికి పక్కనే ఉన్న 300 గజాల స్థలంలో ఫంక్షన్ హాలు నిర్మాణం కోసం పలువురు నేతలు టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా ప్రయత్నించారు. ఇందుకు కమిషనర్ చేకూరి కీర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఖాళీ

2లో

భారమవుతున్న పెట్టుబడులు

- పెరుగుతున్న విత్తనాలు, ఎరువుల ధరలు
- పంటలకు దక్కని మద్దతు ధర
- సాగు కోసం రైతు అప్పులు
- ఏటికేడు పెరుగుతున్న ఖర్చులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. సాగు భారం రైతుకు గుది బండగా మారుతోంది. సాగు ఖర్చులు పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా పంటల ధరలు లేకపోవడం ప్రతిఏటా అప్పుల కోసం తచ్చాడక తప్పని పరిస్థితి ఎదురవుతోంది. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం పెట్టుబడి సాయం కొంత అందజేస్తున్నా అది అదనపు ఖర్చులకే సరిపోతుందని

2లో

పల్నాడు జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తిసాగులో ఖర్చులిలా.. ఎకరా పత్తిసాగుకు విత్తనాలు రూ.2 వేల వరకూ ఖర్చవుతుంది. రెండు మూడుసార్లు దుక్కులకు రూ.5 వేలు, సాళ్ల మధ్య దున్నడానికి రెండుమూడు సార్లకు మరో రూ.3 వేలు, కూలీలతో కలుపు తీత రూ.3-5 వేలు, ఎరువులు రూ.8 వేలు, పత్తితీత కూలి రూ.8-10 వేలు ఇలా సుమారు రూ.30 వేలకుపైగానే ఖర్చు ఉంటుంది.

అజ్ఞాతం వీడిన పిన్నెల్లి!

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌పి మలికా గర్గ్ పలువురు ఉన్నతాధికారుల సమీక్షల్లో పాల్గొనడం వల్ల ఆయన కార్యాలయానికి వెళ్లలేకపోయారు. దీంతో రాత్రి 11 గంటల వరకు వేచిచూశారు. తొలుత ఆయనపై ఈవీఎంల ధ్వంసం కేసు నమోదైంది. ఆ తరువాత మూడు ప్రాంతాల్లో ఆయనపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. ఈనెల 14న పోలింగ్ అనంతరం కారంపూడి మండలం పేట సన్నిగండ్లలో జరిగిన అల్లర్లలో కారంపూడి సిఐ నారాయణ స్వామి ఇచ్చిన వాంగూల్మం ఆధారంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రం ఏజెంటు నంబూరు శేషగిరిరావు తనపై దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఇచ్చిన ఫిర్యాదుపై మరో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రెంటచింతల మండలం రెంటాల పోలింగ్ రోజు టిడిపి ఏజెంటు చెరుకూరినాగ శిరోమణిపై మారణాయుధాలతో దాడి ఘటనపై కేసు నమోదైంది. ఈ కేసుల్లో ఆయన హైకోర్టును ముందస్తు బెయిల్ కోసం ఆశ్రయించారు. హైకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. అంతకు ముందు ఈవీఎంల ధ్వంసం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై వచ్చే నెల 6వ వరకు ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని హైకోర్టు ఇప్పటికే మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

డిగ్రీ పూర్తి చేసుకుని హైదరాబాదు ఓ ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగం చేస్తున్నాడు. మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్ పదో తరగతి తర్వాత ఐటిఐ మోటర్ మెకానిక్ డిప్లమా పూర్తి చేసి హైదరాబాదు బాలానగర్‌లోని హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్‌లో అప్రెంటిస్ చేస్తున్నాడు. హుస్సేన్ ఎల్బీనగర్ సమీపంలోని ఆదిభట్ల ప్రాంతంలో ఒక గదిలో అద్దెకు ఉంటున్నాడు. సోదరుడు ఇస్మాయిల్‌ను హెచ్ఎఎల్ వద్ద దించేందుకు సోమవారం ఉదయం బైక్‌పై వెళుతుండగా మీర్పేట వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. ప్రమాదంలో హుస్సేన్ బేగ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇస్మాయిల్ బేగ్ తీవ్ర గాయాలతో వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతున్నాడు. ప్రమాద వార్త ఫోన్ ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు. హుస్సేన్ బేగ్ మృతదేహాన్ని మంగళవారం తెల్లవారుజామున తెనాలికి తెచ్చారు. చేతికంది వచ్చిన ఇద్దరు కుమారుల్లో ఒకరు మృతి చెందటం, మరొకరు మృత్యువుతో పోరాడటం తల్లిదండ్రులను తీవ్రంగా కలచివేసింది. హుస్సేన్ బేగ్, ఇస్మాయిల్ బేగ్‌ల తండ్రి పట్టణంలోని ఒక వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. కుమారులను తలుచుకుని వారు కుమిలిపోతున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

లెక్కింపులో వివాదాలకు ఆస్కారమివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది అందుబాటులో పెట్టుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని హోటళ్లు, లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ఒక పోలీసు అధికారిని నియమించామని, పోలీస్ సిబ్బందికి బాడీ కెమెరాలు అమర్చే చర్యలూ చేపట్టామని అన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా ఓట్ల లెక్కింపునకు చర్యలు చేపట్టామన్నారు. 700 మందికి పైగా కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతోపాటు ఇతర సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియ అనుబంధ విధుల్లో పాల్గొంటారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని సూక్ష్మ పరిశీలన, సీసీ కెమెరాల నిఘా మధ్య ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు. గందరగోళానికి తావు లేకుండా సరైన విధంగా బ్యారికేడింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు, వాహనాల పార్కింగ్, మీడియా సెంటర్ ఏర్పాటు, రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడికి ప్రణాళిక, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన ఏర్పాట్లు, మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. అధికారులు, సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు తదితరులకు అల్పాహారం, భోజనం, తాగునీరు వంటి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల్లోని ఓట్లను లెక్కించే ప్రక్రియలో భాగస్వాములు కానున్న కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు తదితరులకు నాణ్యమైన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. నరసరావుపేట పార్లమెంట్ నియోజికవర్గానికి సంబంధించి పోస్టల బ్యాలెట్ లెక్కింపుపై రిజర్వ్‌తో కలిపి 145 మంది సిబ్బందిని, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రిజర్వ్‌తో కలిపి 131 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వారికి ఈనెల 29వ తేదిన శిక్షణిస్తామని వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు 18 టేబుళ్లు, అసెంబ్లీ నియోజికవర్గానికి 15 హాల్స్‌లో ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 2 టేబుల్స్, మాచర్ల, సత్తెనపల్లికి నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 3 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 క్యూ ఆర్ కోడ్ స్కానర్లు ఈటిపిబిఎస్. కౌంటింగ్ కోసం అందుబాటులో ఉంచామని తెలిపారు. 27 మంది సిఆర్‌పిఎఫ్, డిఎఆర్ సిబ్బంది–23 మంది, స్టేట్ సివిల్ పోలీస్–34 మంది ఉన్నారని, మొత్తం 155 సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు, వారి తరుపున ప్రతినిధులు కానీ రోజుకు 3 సార్లు స్ట్రాంగ్ రూంలను ప్రత్యక్షంగా

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను వివరిస్తున్న పల్నాడు కలెక్టర్ శ్రీకేష్ లత్కర్

పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించామని, దీనికోసం ఒక అధికారిని నియమించామని చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజు, ఆ తర్వాత అవసరమైతే మరికొన్ని రోజులు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తుకు చేసిన ఏర్పాట్లను వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 1196 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, 7 ఈవిఎంలు పగులగొట్టిన కేసుల్లో 59 మందిని అరెస్టు చేశామని, పోలింగ్ ముందు రోజు 33 కేసుల్లో 143 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. పోలింగ్ రోజున 106 కేసుల్లో 883 మందిని అరెస్ట్ చేయగా పోలింగ్ తరువాతి రోజున 24 కేసులలో 203 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా ప్రతిరోజూ పర్యవేక్షణతోపాటు హింసాత్మక ఘటలకు వీల్లేకుండా ప్రజల్లోనూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమములో డిఐజి జెట్టి గోపినాథ్, ఐజిలు సర్వశ్రేష్ఠ త్రిపాఠి, శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

భారమవుతున్న పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

రైతులు వాపోతున్నారు. ఉన్నట్టుంటే ఆశించే తెగుళ్లు, వాటి నివారణ కోసం మందులు కొట్టడం... పొలానికి సరిపడా నీరందక వాటి కోసం ఇంజిన్లు ఉపయోగించాల్సి రావడం.. వర్షాలొస్తున్నాయని హడావుడిగా పంట రక్షణ చర్యలు తీసుకోవడం ఇలా పలు సందర్భాల్లో రైతులకు పెట్టుబడులు కాకుండా అదనపు ఖర్చులు మీదపడుతున్నాయి. మరోవైపు ఎరువులు, పురుగు మందులు, ఇంధన ధరలు పెరగడం వల్ల ఎకరా సాగుకు రూ.5 వేల వరకూ పెట్టుబడులు గతేడాది కంటే ఈ ఏడాది అధికం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పల్నాడు జిల్లాలో సాగు భూమి 8 లక్షల 75 వేల ఎకరాలు ఉండగా ఇందులో 8 లక్షల 32 వేల 500 ఎకరాలు సాగవుతున్నట్లు అధికారుల అంచనా. ఇందులో అధిక భాగం పత్తి సాగవుతుండగా ఆ తర్వాతి స్థానాల్లో వరి, మిర్చి, అపరాలు, మొక్కజొన్న తదితర పంటలున్నాయి. ఈ ఏడాది కూడా వర్షాధార పంటైన పత్తిసాగు 3,06,250 ఎకరాలకుపైగా వీస్తీర్ణంలో ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నీటి లభ్యత ఆధారంగా ఇతర పంటల సాగు ఉంటుంది.

యూరియా, డిఎపి, కాంప్లెక్స్, ఎంఒపి, ఎస్ఎఫ్‌సి, ఎఎస్ తదితర ఎరువులు జిల్లాలో 3,42,735 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే విత్తన ధరలు పెరగడంతోపాటు గతేడాది ఎరువుల ధరలపైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలను తగ్గించింది. దీంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు రూ.400 నుండి రూ.700 వరకూ పెరిగాయి. మరోవైపు ఇంధన ధరలు సైతం యంత్రాల నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపుతూ ఆ భారమూ రైతులవైపు మళ్లుతోంది. గతేడాది ఎకరా దుక్కికి ట్రాక్టర్ బాడుగ రూ.650 ఉండగా ఇప్పుడు రూ.800కు పైనే ఉంది. గతేడాది ఎకరా పత్తి సాగుకు పెట్టుబడి రూ.25 వేలు కాగా ఈ ఏడాది 30 వేలు దాటుతుందని అంచనా. ఇది కూడా ప్రకృతి అనుకూలిస్తేనే. మధ్యలో అనుకోని తెగుళ్లు దాపురించినా, నీరు సరిగా అందకున్నా అదనపు ఖర్చులే.

ప్రతిఏడూ నష్టాలే

టి.వెంకయ్య, రైతు, అన్నవరం, రొంపిచర్ల మండలం.

ఎరువుల ధరలు పెరిగాయి, డీజిల్, పెట్రోల్ ధరలూ అంతే. దీనివల్ల పెట్టుబడులు పెరిగాయి. పోనీ పంటలకు మద్దతు ధరలైనా లేవు. దీంతో మాకు ప్రతిఏడూ నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం ఎరువులను రాయితీపై ఇవ్వడంతోపాటు మద్దతు ధరలు కల్పిస్తే బాగుంటుంది.

బోయపాటి సాంబశివరావు, రైతు, యలమంద, నరసరావుపేట మండలం.

పెట్టుబడి ఖర్చులు ప్రతిఏడూ తడిసి మోపడవుతున్నాయి. వ్యవసాయంలో ఆదాయం లేకపోగా పెట్టుబడులైనా రాకపోవడంతో చాలామంది రైతులు వ్యవసాయం మానుకుంటున్నారు. గత వానాకాలంతో పోలిస్తే ఇప్పుడు ఎకరానికి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకూ అదనపు భారం పడింది. ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వ్యవసాయాన్ని ఆదుకోవాలి.

కన్ను పడితే కాజేయడమే!

(మొదటి పేజీ తరువాయి)

స్థలం పిల్లలకు పార్కు ఏర్పాటు చేస్తామని కమిషనర్ ప్రతిపాదించగా అధికార పార్టీ నేతలు అడ్డుకుని ఈ స్థలాన్ని ఆలయం కింద ఉంచాలని పలువురు స్వామీజీల ద్వారా వత్తిడి తెస్తున్నారు.

1986లో అప్పటి మునిసిపల్ ఛైర్మన్ గొలుసు కొండలరావు హయాంలో కార్పొరేషన్ స్థలం వేంకటేశ్వరస్వామి ఆలయంకు కేటాయించారు. మొత్తం స్థలం 3600 గజాలు కాగా 1600 గజాలలో ఆలయం నిర్మించారు. 1000 గజాల స్థలంలో తాగునీటి రిజర్వాయర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌కు 700 గజాల స్థలాన్ని కేటాయించారు. ఇంకా 300 గజాల స్థలం ఖాళీగా ఉందని భావించిన వైసిపినాయకులు ఫంక్షన్ హాలు నిర్మించాలని ప్రతిపాదించారు. తద్వారా ఎటువంటి పన్నులూ లేకుండా అద్దెలు దింగమింగవచ్చని అనుకున్నారు. ఇందుకు కమిషనర్ బ్రేక్ వేశారు. మంగళవారం కార్పొరేషన్ అధికారుల చర్యలను నిరసిస్తూ పలువురు మహిళల చేత భజనలు ఏర్పాటు చేశారు. తొలుత ఈ స్థలాన్ని పార్కుకు ఇవ్వరాదని నిరసన తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నా, 144 సెక్షన్ అమలులో ఉందని తెలిసినా పోలీసులు కూడా పట్టించుకోలేదు. చివరికి ఈ సమయంలో నిరసనకు దిగడం తప్పని ఆలస్యంగా గ్రహించిన అధికార పార్టీ నాయకులు చివరికి ఆలయంకే స్థలం కొనసాగించాలని కోరుతూ భజనలు ఏర్పాటు చేశారు. ఆలయం స్థలం కార్పొరేషన్ అధికారులు ఇతర అవసరాలకు ఎలా కేటాయిస్తారని కొత్త వాదన తెరపైకి తెచ్చారు. ఆలయ స్థలంలో ఫంక్షన్‌హాలు నిర్మాణానికి ఎందుకు ప్రతిపాదన చేశారన్నదీ ప్రశ్నార్థకంగా మారింది.

గుంటూరులో ఇప్పటికే పలు ప్రాంతాల్లో కార్పొరేషన్ స్థలాలు అక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలు స్థలాలు అధికార పార్టీ ముఖ్యనేతలు, కార్పొరేటర్లు, వారి అనుచరులు ఆధ్వర్యంలో వేర్వేరు అవసరాల పేరుతో స్వాధీనం చేసుకోవడం, తరువాత వాటిని సేవా, ఆధ్యాత్మిక ముసుగులో వాణిజ్య అవసరాల కోసం వినియోగించి సొమ్ము చేసుకోవడం పరిపాటైంది. గోరంట్ల, సంపత్‌నగర్, శారదాకాలనీ, అంకిరెడ్డి పాలెంలో ఇప్పటికే పలు స్థలాలు కబ్జాకు ప్రయత్నాలు జరిగాయి. తమకు అనుకూలమైన మత పెద్దల ద్వారా ఆందోళనలు చేయించి రాజకీయ నాయకుల ద్వారా కోట్ల విలువైన ఆస్తులను బినామి పేర్లతో కీలకమైన నాయకులు, వారి అనుచరులు తమ గుప్పిట్లోకి పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు ప్రభలంగా విన్పిస్తున్నాయి.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...

E.P. No.08/2024 IN O.S.199/2023

బిట్వీన్:–

షేక్ జానీ, S/o సుభాని, అడ్రస్–Dr.no.11-19,79, రామిరెడ్డిపేట, నరసరావుపేట. ..పిటిషనర్/D.Hr.

And

1. తిరుమలరెడ్డి దుర్గ, w/o. పెద్దిరెడ్డి
2. తిరుమలరెడ్డి నివేద్య, D/o. పెద్దిరెడ్డి
3. తిరుమలరెడ్డి అనిత, D/o. పెద్దిరెడ్డి

అడ్రస్–Dr.no.13-4-65/73A, శ్రీనివాస నగర్, నరసరావుపేట. రెస్పాండెంట్స్/Drs

సదరు పై నెంబర్ అమలు పిటిషన్లో పిటిషనర్ కి మీ తండ్రి తిరుమలరెడ్డి పెద్దిరెడ్డి బాకీ చెల్లింపుకై మీరు బాధ్యత ఉన్నందున (O.S.199/2023 లోని జడ్జిమెంట్ & డిక్రీ ప్రకారం) పైనెంబర్ పిటిషన్ దాఖలు చేసి, సదరు పిటీషన్ లో మీకు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పిటీషన్ నోటీసులు పంపిననూ, ఈ పిటీషన్ విషయం మీకు తెలిసి కూడా మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయిచున్నందున, శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ నోటీస్ ద్వారా తెలియపరుచునది ఏమనగా పై శ్రీ కోర్ట్ వారి ఎదుట మీరంతా ది.20/06/2024 ఉదయం10.30 గం॥ లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించ బడును.

వాయిదా తేదీ.20/06/2024

ఇట్లు:
శ్రీ గుండా రాజేష్ కుమార్,
పిటిషనర్ తరుపు న్యాయవాది,
నరసరావుపేట. సెల్ :9294457244

సమను

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: NARASARAOPET
O.S.NO.242/2023

Between:
Nandipalli Srinivasulu ...Plaintiff
And
01. Gopu Rami Reddy,
02. Gopu Ramanamma,
03. Gopu Vasudeva Reddy,
04. Doppalapudi Balagangadhar Thilak,
... Defendants

To
D1-Gopu Rami Reddy, S/O China Venkateswara Reddy @ Venkateswara Reddy,
Hindu, aged about 61 years, cultivation,
D2-Gopu Ramanamma, W/O Rami Reddy, Hindu, aged about 55 years, Cultivation,
D3- Gopu Vasudeva Reddy, S/O Rami Reddy, Hindu, aged about 35 years, working as VRO,
1 to 3 defendants are residing at Door No. 5-38, Near Ramalayam Temple, Veeravatnam Village, H/O Thurumella Village, Rompicherla Mandal, Palnadu District.
D4-Doppalapudi Balagangadhar Thilak, S/O Venkateswara Prasad, Hindu, aged about 45 years, Business, Resident of Door No. 17-1-383/42/1, 42/2, 43/3, Road No.1, Indraprasta Colony, Sri Krishna Gayatri Towers, Sydabad, Hyderabad.

పై నెంబర్ దావాలో శ్రీ కోర్టువారు అనేక పర్యాయములు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా సమనులు పంపినప్పటికి సదరు సమన్లను మీరు తీసుకోకపోవడంతో పై నెంబర్ దావాలో శ్రీకోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా ప్రతివాదికి సమను జారీచేసియున్నారు. కావున సదరు ప్రతివాది ది.28.06.2024వ తేదిన ఉదయం 10–30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గానీ న్యాయవాది ద్వారా గానీ హాజరు అయి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలసినదనీ లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడుననీ ఇందు మూలంగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేది:28.06.2024.

గుజ్జర్లపూడి ఏసురత్నం,
వాది తరుపు న్యాయవాది,
సత్తెనపల్లి–522403.

క్లాప్ డ్రైవర్లకు రూ.20 వేల కనీస వేతనమివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-తాడేపల్లి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టాలు చెబుతున్నా పాలకవర్గ పార్టీలు, అధికారులు అమలు చేయడంలేదు. దీనికి ఉదాహరణే క్లాప్ ఆటోడ్రైవర్ల జీతాల్లో కోత. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఇరుకైన బజార్లలో నుంచి చెత్త తరలించేందుకు క్లాప్ ఆటోలను ఏర్పాటు చేశారు. నిత్యం 60 ఆటోలు టన్నుల కొద్ది చెత్తను తరలిస్తున్నాయి. 60 మంది డ్రైవర్లు చెత్తను బయటకు తరలించి ప్రజల ఆరోగ్యం కాపాడే దాంట్లో భాగస్వామ్యం అవుతున్నారు. ఇంత ప్రాముఖ్యత గల క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తుంది. కానీ కాంట్రాక్టర్లు మాత్రం నెలకు వీరికి రూ.12 వేలు మాత్రమే జీతం ఇస్తున్నారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఎంటిఎంసి మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డిలకు క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) అనేకసార్లు వినతిపత్రాలు అందజేసింది. సిఐటియు ఆందోళన ఫలితంగా క్లాప్ డ్రైవర్లకు రూ.24 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వం జిఒ ఇచ్చింది. ఎంటిఎంసి కార్పొరేషన్‌లో పబ్లిక్ హెల్త్ ట్రాక్టర్ డ్రైవర్లకు ప్రస్తుతం

రూ.24 వేలు జీతం ఇస్తున్నారు. అదే మాదిరిగా తమకు కూడా ఇవ్వాలని సిఐటియు పోరాటం ఫలితంగా ప్రభుత్వం జిఒ ఇచ్చిందిగానీ నిధులు మాత్రం విడుదల చేయలేదు. ఎంటిఎంసి అధికారులను యూనియన్ నాయకులు సంప్రదించగా క్లాప్ డ్రైవర్ల జీతభత్యాలకు సంబంధించి తమకు సంబంధంలేదని చెబుతున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా వారికి జీతాలు ఇస్తున్నారని, వారిని కలవాలని చెబుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరధిలోని చెత్తను తరలిస్తున్న క్లాప్ ఆటోడ్రైవర్లకు ఆప్కాస్ ద్వారా జీతాలు ఇవ్వాలని, కార్పొరేషనే అందుకు బాధ్యత తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తుంది. కార్పొరేషన్ క్లాప్ ఆటోలకు సంబంధించి ఆయిల్, మెయింటెనెన్స్, జీతభత్యాలకు రూ.63 వేలు డ్రా చేస్తున్నారు. డ్రైవర్లకు మాత్రం రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారు. పబ్లిక్ హెల్త్ సిబ్బందితో సమానంగా పని చేస్తున్న తమకు జీతాలు కూడా అదేస్థాయిలో ఇవ్వాలని క్లాప్ ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

ప్రతినెలా మొదటి తేదీనే జీతాలివ్వాలి

క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య

పబ్లిక్ హెల్త్ ట్రాక్టర్ డ్రైవర్లకు ఇచ్చిన విధంగా క్లాప్ ఆటో డ్రైవర్లకు కూడా ప్రతినెలా మొదటి తేదీన రూ.24 వేలు జీతం ఇవ్వాలని ఎంటిఎంసి కార్పొరేషన్ క్లాప్ ఆటోడ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆప్కాస్ ద్వారా జీతాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికీ ఎంటిఎంసి పరిధిలో క్లాప్ ఆటోడ్రైవర్లకు రెండు నెలల జీతాలు పెండింగ్ ఉన్నాయని ఆందోళన వెల్లిబుచ్చారు. ప్రభుత్వం జిఒలు ఇస్తుందిగానీ వెంటనే అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని క్లాప్ ఆటో డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం వచ్చే విధంగా చూడాలని ఆయన కోరారు.

పాలీసెట్ కౌన్సెలింగ్‌కు 199 మంది హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్ కాలేజిల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న పాలీసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజిలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో మంగళవారం రెండో రోజు 12001 నుండి 27000 ర్యాంకు వరకూ ధ్రువపత్రాల పరిశీలన చేపట్టగా 199 మంది విద్యార్థులు హాజరయ్యారు. నేడు 27001 నుండి 43000 ర్యాంకు వరకూ ధృవపత్రాలు పరిశీలన చేస్తారు.

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆలపాటి, మనోహర్ తదితరులు

ముగిసిన శకపురుషుని శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తెనాలి

టిడిపి వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల వేడుకల ముగింపు సభ మంగళవారం స్థానిక నాజరు పేట ఎన్ వి ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఎన్టీఆర్ జయంతిని పరిష్కరించుకొని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఏడాది పాటు నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల ఆడియో విజువల్స్ ప్రదర్శనను ప్రముఖ వైద్యులు డాక్టర్ డి శారద ప్రారంభించారు. ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారాలను అందుకున్న వారి దృశ్యాలను, కళాకారులను సత్కరించిన సన్నివేశాలను కూడా స్క్రీన్పై ప్రదర్శించారు. సభ ప్రారంభోపన్యాసం లో సినీ మాటల రచయిత బుర్ర సాయి మాధవ్ మాట్లాడుతూ తెలుగు సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్ కు సరి జోడి లేరన్నారు. ఆయన పేరిట ఏడేది పాటు శతజయంతి ఉత్స వాలు నిర్వహించటం ఆలపాటికే సాధ్యమైందని ప్రశంసించారు. ఆలపాటి మాట్లాడుతూ పేదల సంక్షేమంతోపాటు తెలుగు వారి ఆత్మగౌరవ నినాదంతో టిడిపిని స్థాపించి, 9 నెలల్లో అధికారంలోకి తెచ్చిన ఘనత ఎన్టీఆర్కు దక్కుతుందన్నారు. సినీ రంగంలో మకుటం లేని మహారాజుగా ఎన్టీఆర్ ఎదిగారన్నారు. సినీ జగత్తులో తనకంటూ ఓ ప్రత్యేకతను తెచ్చుకుని విశేషంగా అభి మానులను సంపాదించుకున్నారన్నారు. ఏడేది పాటు ఆయన సినిమాల ప్రదర్శనకు లభించిన ఆదరణే అందుకు నిదర్శనంగా చెప్పారు. టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తెలుగు సినిమా రంగానికి వన్నెతెచ్చిన ఘనుడు ఎన్టీఆర్ అని చెప్పారు. రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. సభలో చెరుకుమల్లి సింగారావు, ఆర్ గిరిధర్ గౌడ్, ఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ పి దక్షిణామూర్తి, జుగాష్ వలి మహమ్మద్ సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

తెలుగుదేశం వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101 వ జయంతి వేడుకలు మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

మంగళగిరిలో టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు నందం అబద్దయ్య, జొన్నాధుల బాలకృష్ణ, వాకా మాధవరావు తదితరులు పూల మాలవేసి నివాళు లర్పించారు. తాడికొండలో టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. తాడేపల్లి రూరల్ ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి తెలుగుదేశం మండల కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, ఎన్టీఆర్ కు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, సీట్లు పంపిణీ చేశారు. ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, నాయకులు కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు మాట్లాడారు. పొన్నూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత నందమూరి తారక రామారావు చిత్రపటానికి సంఘం డైరీ చైర్మన్, రాష్ట్ర సీనియర్ టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లి టిడిపి పట్టణ కార్యాలయంలో ఎన్టిఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తాడేపల్లిలోని కార్యాలయం ప్రాంగణంలో ఎన్టిఆర్‌కు ఘన నివాళులర్పించారు. తెలుగు చిత్ర పరిశ్రమ మనుగడకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఛాంబర్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజా వాసిరెడ్డి భూపాల్‌ప్రసాద్, జనరల్ సెక్రటరీ జె.వి.మోహన్ గౌడ్ మాట్లాడారు. పెదనందిపాడులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలు వేసి కేక్ కట్ చేశారు. ప్రముఖ ఎన్నారై కాట్రగడ్డ షర్మిల సహకారంతో 127 రోజు అన్న క్యాంటీన్లో సీటు హార్ట్ తో సహా పేదలకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్యాంటీన్ కు పేద ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుంది.

మంగళగిరిలో నివాళి

తాడేపల్లి రూరల్‌లో

తాడేపల్లిలో

పొన్నూరులో

రెండున బాలల వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభ

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో జూన్ రెండో తేదీ అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా తాడేపల్లి అమరావతి ఐకాన్ క్లబ్ హౌస్‌లో నిర్వహించిన బాలల వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభ, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు ఓ ప్రకటనలో కోరారు. ఆ మేరకు మంగళవారం వివిధ అపార్టుమెంట్లలోని పిల్లల తల్లిదండ్రులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. సభకు రావాలని సాదరంగా ఆహ్వానించారు. బైపాస్‌రోడ్డు అపార్టుమెంట్ల ప్రాంతాన్ని ఐదు జోన్లుగా విభజించి ఆయా ప్రాంతాల్లో సభ జయప్రదానికి బాధ్యులు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ఎపి గ్రంథాలయ సంఘం కార్యదర్శి డాక్టర్ రావి శారద, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ తాడేపల్లి అధ్యక్షులు జిఎస్ఆర్ మోహనరావు, బాలోత్సవం గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అమరావతి ఐకాన్ మిత్ర బృందం తరపున యడ్ల బాలకృష్ణ పాల్గొంటారు. ఈ వేసవిలో 22 రోజుల పాటు వివిధ అంశాల మీద ఎంటిఎంసి బాలోత్సవం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల తల్లిదండ్రులు, అపార్టుమెంట్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ వైర్లకు ఐదు గేదెలు బలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మండలం కేంద్రం వెల్దుర్తి గ్రామంలో ఐదు గేదెలు మృతి చెందిన ఘటన మంగళ వారం చోటుచేసుకుంది. మేతకు వెళ్లి వస్తున్న గేదలు గ్రామంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు కిందకు రావడంతో ఆవి తగిలి షాక్‌నకు గురయ్యి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క గేద రూ.1లక్ష ఉంటుందని, దాదాపు రూ.5లక్షల నష్టం వచ్చిందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు.

కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కట్నం కోసం భర్త, అత్త ఇంటి వారు వేధిస్తున్నారని ప్రత్తిపాడు పోలిస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. స్టేషన్ ఎస్ఐ వి సోమేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలం లోని పార్వతిపురం గ్రామానికి చెందిన మొగిలి నవ్య, బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం, ఉపమాగులూరు గ్రామానికి చెందిన మొగిలి సుభాష్ 2022లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కట్న కానుకలు తేలేదని, అప్పటి నుండి భర్త, అతని తల్లి,దండ్రులు, ఆడబడుచు కట్నం కోసం వేధిస్తున్నారని నవ్య ఫిర్యాదులో తెలిపారు. కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు, చిత్ర హింసలు పెడుతున్నట్లు, చంపుతాము అని బెదిరిస్తున్నట్లు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

యువకుని అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి తెనాలి

యువకుడి అదశ్యంపై పట్టణ ఒన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని సాలిపేటకు చెందిన 20 ఏళ్ల యువకుడు దొడ్డ వెంకట సాయి కుమార్ రెడ్డి ఈనెల 27న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. తరచుగా సైకిల్ పై సాయిబాబా గుడికి వెళ్లి వస్తుంటాడని, ఫిట్స్ వ్యాధితో కూడా బాధపడుతుంటాడని, కుమారుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి ఆచూకీ తెలిసినవారు ఒన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముక్కంటి మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము ముక్కంటి (63) గుండెపోటుకు గురై సోమవారం రాత్రి మృతి చెందారు. తొలుత ఆయనకు సోమవారంరాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స చేస్తుండగా కొద్దిసేపటికి మృతి చెందారు. గతంలో వైసిపి ఎస్సీ విభాగం జిల్లా నాయకులుగా వ్యవహరించిన ముక్కంటి అనంతరం కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచారు. తొలిసారిగా వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముక్కంటి అంత్యక్రియలు మంగళవారం నిర్వహించగా పలువురు వైసిపి నాయకులు, ప్రముఖులు నివాళులర్పించారు. వైసిపి అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

కెజిబివిలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని మిట్టగుడిపాడు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి)లో 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీలో 40 చొప్పున సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ-2 శివనాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఐదో తరగతి ఉత్తీర్ణులైన రెంటచింతల మండలానికి చెందిన విద్యార్థులు, ఇంటర్లో ప్రవేశానికి 10లో ఉత్తీర్ణత సాధించి జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పనిచేయని క్యాష్ డిపాజిట్ మిషన్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని ఎన్‌ఆర్‌టి సెంటర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్‌లోని ఎటిఎం క్యాష్ డిపాజిట్ మిషన్లు పని చేయక ఖాతాదార్లు ఇబ్బందులు పడుతున్నారని ప్రజామేనిఫెస్టో కమిటీ కన్వీనర్ ఎం.భానుప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు నగదు చెల్లింపుల్లో జాప్యమైతే అదనపు ఛార్జీలు వసూలు చేసే బ్యాంకులు... సేవలు అందించడంలో వైఫల్యం చెందితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఎటిఎం మిషన్లు పని చేయకపోవడం, ఆయా కేంద్రాల్లో ఏసీలూ పని చేయకపోవడం పరిపాటైందని, ఈ సమస్యలపై అధికారులు సత్వరం స్పందించాలని కోరారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ, పోటీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు స్థానిక ఎంఇఒ కార్యాలయంలో వద్ద శిక్షణ, వంటల పోటీలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థికి దినసరి ఆహారంలో కచ్చితంగా అందించాల్సిన పోషకాలపై అవగాహన కల్పించారు. వంట చేసేటప్పుడు పోషకాలు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. అనంతరం రిసోర్స్ పర్సన్ కె.జయలక్ష్మి మాట్లాడారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అనుమతుల్లేని విత్తన విక్రయాలు నిలిపివేత

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఫారం-సి లేకుండా నిల్వ చేసిన రూ.90 వేల విత్తనాలను అధికారులు గుర్తించి అమ్మకాలను నిలిపేశారు. విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గడువు ముగిసిన విత్తనాలు అమ్మవద్దన్నారు.ని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏవో రమణకుమార్, ఎస్ఐ రామచంద్రారెడ్డి, మండల వ్యవసాయాధికారి కె.లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖఅధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. విత్తన నమూనాలు సేకరించి సీడ్స్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. విత్తనాలు అధిక ధరలకు అమ్మినా, అనుమతి లేని, నాసిరకం విత్తనాలు ఎవరైనా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు దుకాణం లైసెన్సు రద్దు చేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని, బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

ఋతుక్రమంపై చర్చ, అవగాహన అవసరం

అవగాహన కల్పిస్తున్న శాంసన్

ప్రజాశక్తి - క్రోసూరు

ఋతుక్రమం (పీరియడ్స్)పై విస్తృత చర్చ, అవగాహన అవసరమని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు. ఋతుక్రమం-ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రోసూరు శివారు ఎర్రబాలెంలో ప్రాథమిక పాఠశాలలో కిశోర బాలికలకు, మహిళలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శాంసన్ మాట్లాడుతూ ఋతుక్రమం అనేది పుట్టుకకు కారణమన్నారు. దీనిపై అందరిలోనూ సరైన అవగాహన ఉంటేనే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమని చెప్పారు. పీరియడ్స్ సమయంలో రక్తాన్ని పీల్చుకోవటానికి మెరుగైన నాణ్యమైన ప్యాడ్‌లను ఉపయోగించాలని, శానిటరీ పాడ్స్ మార్చినప్పుడల్లా చేతులను శుభ్రం చేసుకుంటే ఇన్‌ఫెక్షన్‌ను నివారించవచ్చని చెప్పారు. ప్యాడ్లను టాయిలెట్లలో, ఎక్కడంటే అక్కడ పడేయడం మంచిది కాదని, వాటిని టాయిలెట్ పేపర్లో బాగా చుట్టి డస్ట్ బిన్‌లో వేయాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రజినీ మాట్లాడుతూ పీరియడ్స్ వచ్చే ముందర తలనొప్పి, చిరాకు లేదా అలసట, పొత్తికడుపులో తిమ్మిర్లు, నడుము నొప్పి ఉంటాయని చెప్పారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చలామణిలో ఉన్న అపోహలపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త డి.స్వప్నరాణి, ఆశా కార్యకర్తలు పార్వతి, సుస్మిత, అంగనవాడి టీచర్ మల్లిక, కిసోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మలాయథిన్ పిచికారి

ప్రజాశక్తి - మాచర్ల : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసమే పలు హాస్టల్స్‌లో మలాథియన్ పిచికారి చేస్తున్నట్లు జిల్లా మలేరియా శాఖాధికారి రవీంద్రరత్నాకర్ తెలిపారు. వెల్దుర్తి, దుర్గి మండలాల్లో పలు హాస్టల్స్‌లో మలాథియన్ పిచికారి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. దోమ కాటు నుండి విద్యార్థులను కాపాడి తద్వారా వారి ఆరోగ్యాన్ని రక్షించేందుకు మలాథియన్ పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని హాస్టల్స్‌లో ఈ పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు డి.లక్ష్మయ్య, సిహెచ్.శ్రీనివాసరావు, టి.నాగేశ్వరరావు, బాలయ్య, సద్గురు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న అట్లూరి విజయ్ కుమార్

దాడులపై ఫిర్యాదు చేసినా అరెస్టు చేయలేదు : వైసిపి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజలు మాత్రం జగన్ వెంటే ఉన్నారని, రాష్ట్ర మఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ గెలవబోతున్నారని వైసిపి నాయకులు ఎ.విజయ్‌కుమార్ అన్నారు. ప్రకాష్‌నగర్‌లోని వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ సందర్భంలో వైసిపి నాయకులపై కూటమి నాయకులు దాడులు చేశారని, మాచర్ల, గురజాల, నరసరావుపేట ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై, కార్యకర్తలు, నాయకులపై దాడులు జరిగాయని అన్నారు. ఈ విషయాలను ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా కూటమి నాయకులను అరెస్టు చేయలేదని చెప్పారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు కనుసైగల్లోనే అల్లర్లు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపు రోజున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనవెంట టి.నాని, డి.వీరాస్వామి, బి.జయరావు, కె.చిన్నబాబు ఉన్నారు.

గొడవలు పెట్టుకుంటే కుటుంబాలకు నష్టం

ప్రజాశక్తి-ఈపూరు

గొడవలతో కుటుంబాలు ఆర్థికంగా, జీవనపరంగా దెబ్బతింటాయని వినుకొండ స్పెషల్ డీఎస్పీ తిరుపతయ్య అన్నారు. మండలంలోని అంగలూరు, కొండ్రముట్ల గ్రామాల్లో మంగళవారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. అనుమానస్పద ప్రదేశాలలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎటువంటి ధ్రువపత్రాలూ లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ తిరుపతయ్య మాట్లాడుతూ ఎన్నికలవేళ పోలింగ్ కేంద్రాలు, గ్రామాల్లో గొడవలు జరిగాయని గుర్తు చేశారు. ప్రశాంత వాతావరణంలో గ్రామాలు ఉండాలని సూచించారు. గొడవలు నివారించేందుకు ఎన్నికల కమిషన్ కేంద్ర బలగాలను కేటాయించిందని, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తమకు ప్రజలు సహకరించాలని కోరారు. తనిఖీల్లో వినుకొండ రూరల్ సిఐ యు.సుధాకర్‌రావు, ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్, నూజెండ్ల, బొల్లాపల్లి ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గురజాల

పోలింగ్ అనంతరం ఘర్షణలు, ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గురజాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక జిఐసి కాలనీలో సిఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ధ్రువపత్రాలేమీ లేని ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐలు అనంతకృష్ణ, సౌందర్య రాజన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని 29వ వార్డులో ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ధ్రువ పత్రాలేమీ లేని 22 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణపై సమీక్ష

ప్రజాశక్తి - నాదెండ్ల

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా నివారించేందుకు పలు శాఖల అధికారుల సమావేశం మంగళవారం సమావేశం నిర్వహించారు. విఆర్‌ఎలు, విఆర్‌ఒలకు పోలీసులు, తహశీల్దార్ మున్నీసాబేగం, ఎంపిడిఒ జాకీర్ హుస్సేన్ పలు సూచనలిచ్చారు. గొడవలు, అల్లర్లకు అవకాశం ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలని సూచించారు.

ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

పని ప్రదేశాలను పరిశీలించిన సిపిఎం, వ్యకాస నాయకుల డిమాండ్

పెదకాకానిలో ఉపాధి కూలీలలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - పెదకాకాని

ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్‌ను మంజూరు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని గోళ్లమూడి రోడ్డులో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సిపిఎం మండల కార్యదర్శి ఎన్.శివాజి, నాయకులు జి.రాజారమేష్‌తో కలిసి రామారావు మంగళవారం సందర్శించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో నిర్వహించిన సమావేశానికి శివాజి అధ్యక్షత వహించగా రామారావు మాట్లాడుతూ వామపక్షాల వత్తిడి మేరకు యుపిఎ-1 హయాంలో ఉపాధి హామీ చట్టం వచ్చిందని, అయితే ఈ చట్టాన్ని ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కూలీలంతా ఏకమై చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్ట ప్రకారం ప్రతి కుటుంబానికి ఏడాదిలో కనీసం 100 రోజులు పని కల్పించి కనీస వేతనం రూ.300 ఇవ్వాలన్నారు. రెండు పూటలా పని చేయాలనే నిబంధనను తొలగించాలని కోరారు. కూలీలతో పని చేయించి నందుకుగాను ప్రతి మేట్‌కు అదనంగా ఒక్కో కూలీకి రూ.2 చొప్పున ఇవ్వాల్సి ఉన్నా రద్దు చేశారని, దాన్ని పునరుద్ధరించాలని అన్నారు. కూలీలకు ప్రతివారం పే స్లిప్‌లు మంజూరు చేయాలని, ప్రమాదం జరిగితే వెంటనే మెడికల్‌కిట్ అందుబాటులో ఉంచాలని, పనిముట్లయిన పలుగు, పారతోపాటు తాగునీరు, వడదెబ్బ తగలకుండా మజ్జిగ వంటివాటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. శివాజి మాట్లాడుతూ కూలీలు హాజరు వేయించుకోవడానికి, ఫొటో తీయించుకోవడానికి కనీసం రెండుమూడు కిలోమీటర్లు నడిచి ఒకచోటకు రావాల్సి వస్తోందని, ఎక్కడికక్కడే హాజరు నమోదు, ఫొటోలకు అవకాశం ఇవ్వాలని కోరారు. వారానికి ఒకసారి కూలి డబ్బులివ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాల్లో కూలీలంతా కలిసి రావాలన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ : ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు కనీస వేతనం అమలు చేయాలని అలాగే సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడికొండ మండలంలోని తాడికొండ ,మోతాడక గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వారు పరిశీలించారు ఈ సందర్భంగా కూలీలు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు ఎండలు తీవ్రంగా ఉన్నాయని వడగాలుపులు వీస్తున్నాయని ఈ పరిస్థితుల్లో గతంలో ఇచ్చినట్లుగా సమ్మర్ అలవెన్స్ ఇవ్వటం లేదని, మెడికల్ కిట్, పలుగు, సాన పటడానికి డబ్బులు ఇవ్వటం లేదని వాపోయారు. ఈ సందర్భంగా ఈయని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించడం లేదని విమర్శించారు. రూ.300 వేతనం ఇస్తున్నాం అనే పేరుతో పలుగు, పారా ,మంచినీరు సమ్మర్ అలవెన్స్ వంటి సదుపాయాలను తీసివేశారని ఇది సరైనది కాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని,సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని చేసిన పనికి వివరాలు ఉండే విధంగా పే స్లిప్పులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి. భద్రయ్య ,జోషి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వెంటనే పే స్లిప్పులు ,మెడికల్ కిట్లు ,పలుగు పార లాంటి సామాన్లు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు ఫిరంగిపురం మండల కార్యదర్శి ఎస్కే. మస్తాన్ వలి డిమాండ్ చేశారు. సోమవారం ఫిరంగిపురం మండల ంలోని పొనుగుపాడు, మునగోడుపాడు, మేరికపూడి గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు అనేక సమస్యలు తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం పలుగు పారా అందజేశారని ఇంతవరకు ఎటువంటి పనిముట్లు ఇవ్వలేదని, చేసిన పనికి కూలి ఎంత పడుతుందో తెలియజేసే పే స్లిప్పులు ఇవ్వటం లేదని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎండ తీవ్రత వల్ల వడగాల్పులు వీస్తున్నాయని ఈ పరిస్థితుల్లో రెండు పూటలా పనిచేయడం కష్టమని అందువల్ల ఒక్క పూటనే పనిపెట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

తాడికొండలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ఫిరంగిపురంలో

క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణా తరగతులు

అల్ట్రా సౌండ్ స్కానింగ్ కూడా స్క్రీనింగ్‌లో చేర్చాలి

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్యాన్సర్ గురించి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రి నాట్కో కేంద్రంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రి వైద్యుల కు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులు మూడురోజుల పాటు జరుగుతాయి. తొలి రోజు జరిగిన సమావేశంలో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల సత్వరమే వైద్యం అందిస్తామని ఆయన చెప్పారు. క్యాన్సర్ వ్యాధి ముదిరిన తరువాత ఎలాంటి ఫలితాలు ఉండవని అయన స్పష్టం చేసారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల వైద్యులు రోగులకు క్యాన్సర్ గురించి వాటి దుష్ప ఫలితలా గురించి వివరించాల్సిన అవసరం ఉందని అయన సూచించారు. నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార, క్యాన్సర్ లను ప్రాథమికంగా గుర్తించడానికి వివిధ రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరు ఈ విషయాన్నీ గుర్తించాలని అయన చెప్పారు. అదేకాకుండా మహిళలకు కడుపు అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయడం వల్ల గర్భ సంచి ద్వారా వచ్చే వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులను కనుగొనవచ్చని ఆయన తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ కూడా స్క్రీనింగ్ లో భాగం చెయ్యాల్సిన అవసరంఉందని ఆయన అన్నారు. జీర్ణ కోశ సమస్యలు వచ్చినప్పుడు గ్యాస్ ట్రబుల్ ఉందని తాత్కాలిక మందులు వాడకుండా సరైన వైద్యులను సంప్రదించి ఎండో స్కోపి పరీక్షలు చేయించు కోవాలని అయన సూచించారు. దానివల్ల జీర్ణ కోసం క్యాన్సర్, పెద్ద ప్రేగు క్యాన్సర్ వ్యాధులను

గుర్తించ వచ్చని ఆయన చెప్పారు. 30 ఏళ్ళు దాటినా ప్రతి మహిళా రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ ముఖ ద్వారా, అండాశయ క్యాన్సర్ కాకుండా మెడలో ఉండే దేరాయిడ్ గ్రంధి స్కానింగ్ చెయ్యడం వల్ల థైరాయిడ్ క్యాన్సర్ ను కూడా ప్రాథమిక దశలో గుర్తించడానికి వీలవుతుందని అయన అన్నారు. శరీరం లో ఎక్కడైనా చేడు గడ్డలు వచ్చిన, మానకుండా ఉండే పుండ్లు , నోటి వెంట రక్త పడుతుండటం, బరువు తగ్గిపోవడం జరిగితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని అయన చెప్పారు. శరీరంలో ఏ చిన్న గడ్డ వచ్చిన దానిని సూది పరీక్షల ద్వారా క్యాన్సరా, కాదా నిర్ధారణ చేసుకోవాలన్నారు. తీసివేసిన గడ్డ ను తప్పని సరిగా ప్రాథమిక పరీక్షలకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక మంది ప్రజలు ఆసుపత్రులకు వస్తూ వైద్యుల సలహాలను పాటిస్తున్నారని ఆయన చెప్పారు. అర్బన్ ప్రాంతాల్లోని విద్యావంతులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కొంతమంది వైద్యులు కూడా క్యాన్సర్ రాదనే అపోహల్లో ఉంటున్నారని ఆయన చెప్పారు. క్యాన్సర్ ఎవరికైన రావచ్చని అందరు జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం భయపడకుండా ముందుకు వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని అయన అన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి టి కె రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ శ్రావణ బాబు , డాక్టర్ సీతారాం పాల్గొన్నారు.

చిల్డ్రన్ క్యాంపులో పాల్గొన్న ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా నాయకులు పీటర్

పిల్లలకు ఇంగ్లీషు పరిజ్ఞానం తప్పనిసరి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యములో గత నాలుగు రోజులుగా చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్ దిగ్విజయంగా నిర్వహించబడుతుంది. 4వ రోజు మంగళవారం సమ్మర్ క్యాంప్‌ను పల్నాడు జిల్లా ప్రజానాట్యమండలి నాయకులు డి.పీటర్ ప్రారంభించి ప్రసంగించారు. సమ్మర్ క్యాంప్ లు పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని క్యాంపు నిర్వహిస్తున్న విజ్ఞాన కేంద్రం వారికి అభినందనలు తెలిపారు. హైస్కూల్ సైన్స్ టెక్నాలజీ లోని విషయాలను తేలికగా అర్ధం చేసుకునేందుకు ఇంగ్లీష్ పరిజ్ఞానం తప్పనిసరని అన్నారు. ఈ క్రమంలో ఇంగ్లీషు వాఖ్య నిర్మాణాలు తేలిక పద్ధతిలో పిల్లలకు నేర్పించడం అవసరం అని అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం పూర్వ కార్యదర్శి నన్నపనేని శివప్రసాద్ పిల్లలకు దేశభక్తి గీతం నేర్పారు. ప్రారంభ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, చుక్కా యానాదులు, నన్నపనేని శివప్రసాద్, మర్రి లక్ష్మి, భీమినేని రవి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రాయపాటి మమత

ఆకలి రహిత ప్రపంచం సాధన లక్ష్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆకలి-రహిత ప్రపంచం' సాధన దిశగా మలబార్ గ్రూప్ చేపట్టిన ప్రతి రోజు 51,000 పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేయడం ముదావాహమని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ రాయపాటి మమత అన్నారు. ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్-2 జీరో హంగర్ ప్రోగ్రాంకు మద్దతుగా ప్రారంభించబడిన కార్యక్రమం ద్వారా 31,000 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారని ఆమె తెలిపారు. ఈ సంఖ్యను పెంచుతూ 51,000 పుష్టికరమైన ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయడం హర్షనీయం అన్నారు. మంగళవారం జరిగిన 'వరల్డ్ హంగర్ డే' కార్యక్రమాన్ని గుంటూరు లో డాక్టర్ రాయపాటి మమత, పెద్ది రమణ రావు ప్రారంభించారు. ఈ విస్తరణ ప్రణాళికను అధికారికంగా ప్రారంభించారు. స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్, ఎంపి అహ్మద్ మాట్లాడుతూ మలబార్ గ్రూప్ థనల్ వాలంటీర్లు వీధులు పట్టణ శివారు ప్రాంతాలలో నిరుపేదలను గుర్తించి, ఆహార ప్యాకెట్లను వారి ఇంటి వద్దకే తీసుకుని వచ్చి అందిస్తారని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ ఆర్.ఎన్ మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : సీనియర్ జర్నలిస్ట్ ఆర్.ఎన్.గోపాలకృష్ణ (75) మంగళవారం తీవ్ర అస్వస్థతతో తిరుపతి రుయా ఆసుపత్రి లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. కలరు.వీరు సుదీర్ఘ కాలం రేపల్లె, తెనాలి లో ఈనాడు అపై జనతా, ప్లెడ్జి విలేకరిగా పని చేసారు.భాషాప్రవీణ పూర్తి చేసి తెనాలి లో తెలుగు పండిట్ గా పనిచేసి పదవీ విరమణ చేశారు. బుధవారం ఉదయం స్వస్థలం అంగలకుదురులో అంత్యక్రియలు జరుగుతాయని ఆర్.ఎన్ సన్నిహితులు నిమ్మరాజు చలపతిరావు తెలిపారు.



సిపిఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలి

డాక్టర్ ఆకుల శివ ప్రసాద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుత సమాజంలో ఒత్తిళ్ల, మారిన ఆహారపు అలవాట్లతో చిన్న వయసులోనే అనేకమంది గుండె సంబంధిత వ్యాధుల బారిన పడి మృతి చెందుతున్నారని, అయితే ఆ సందర్భంలో ప్రథమ చికిత్స అయిన సిపిఆర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉంటే ప్రాణాలు కోల్పోకుండా వ్యక్తిని కాపాడేందుకు అవకాశం ఉంటుందని ప్రముఖ గుండె వైద్య నిపుణులు (గుంటూరు ఉదయ్ హాస్పిటల్ కన్సల్టెంట్) నరసరావుపేట శివకార్డియక్ క్లినిక్ వైద్యులు డాక్టర్ ఆకుల శివప్రసాద్ అన్నారు. గుండె సంబంధిత వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని, ఆరోగ్య పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ఆహారం, చేయవలసిన వ్యాయామాలు, గుండె నొప్పి వస్తే, అంబులెన్స్ వచ్చే లోగా చేయాల్సిన చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండె పోటుకు గురైన వ్యక్తిని వెల్లకిలా పడుకోబెట్టి గుండెపై అరచేతితో ఒత్తిడిని ప్రేరేపించాలని, నోటితో బాధితునికి నోరు ముక్కు గుండా శ్వాసను అందించాలని, సిపిఆర్ చేసే వ్యక్తి రెండు చేతులు బంధించి భుజాలు ఎత్తులో ఉంచి నిమిషానికి 100 సార్లు లేదా బాధితుడు సాధారణ స్థితికి చేరే వరకూ ప్రేరేపిస్తూనే త్వరితగతిన గుండె వైద్య నిపుణులను సంప్రదించాలని వివరించారు. గుండెపోటుకు గురైన వారిలో ప్రథమ చికిత్స పరంగా చేసే సిపిఆర్ 90 శాతం ప్రాణాపాయం నుండి కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. షుగర్, బీపి, థైరాయిడ్ బాధితులు, వంశపార పర్యంగా గుండె వ్యాధులు ఉన్న కుటుంబంలో ఉన్న వ్యక్తులు మరియు ధూమ మద్యపానం అలవాటున్న వారు తరచు గుండె వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తమ క్లినిక్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లలో 30కు పైగా వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు అందించామని, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆకుల శివప్రసాద్

పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతుల ఎదురు చూపులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాగు భూమిలో సూక్ష్మ పోషకాల వద్ధికి భూమి సారవంతానికి పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని పదేపదే చెబుతున్న వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలను అందుబాటులో తీసుకురావడంలో విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంలో పచ్చిరొట్ట ఎరువులు సాగుభూమికి సాగు చేసే పంటలకు శ్రీరామ రక్ష అని చెబుతుంటారు. పంటలు సాగు చేయడానికి ముందుగా రైతులు తమ పొలాల్లో భూసారం పెంచుకునేందుకు అత్యధిక పంట దిగుబడులు సాధించేందుకు కొందరు రైతులు కోళ్ల పశువుల,గొర్రెల ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులను వినియోగిస్తుంటారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో పశు వుల పోషణ తగ్గిన నేపథ్యంలో పశువుల ఎరువు అంతంత మాత్రమే అందుబాటులో ఉంటుంది. దీంతో రైతులు భూసారం పెంచుకునేందుకు సూక్ష్మ పోషకాలను వద్ధి చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు వైపు మొగ్గు చూపుతున్నారు. మరికొందరు రైతులు అధిక దిగుబడులు సాధించాలని మితిమీరిన రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని పంటలు తీవ్రమైన పోషక పదార్థాలు లోపానికి గురై చీడ పీడలు సులువుగా ఆశించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువులైన పచ్చిరొట్ట విత్తనాలను సంబంధిత అధికారులు అందుబాటులో ఉంచి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉండగా విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంతో రైతులను నిరాశ చెందుతున్నారు. జనుము,జీలుగ, పిలిపెసర వంటి పచ్చిరొట్ట పంటల సాగుకు మే, జూన్ నెలలో తొలకరి వర్షాలు పడగానే పొలాన్ని దున్ని విత్తనాలను చల్లుతారు. పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. అయితే రైతులకు ఇప్పటికే పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిఉంది. కానీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. త్వరితగతిన పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో తీసుకువచ్చి సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

ఇప్పటికే అందుబాటులో ఉంటే బాగుండేది

వి.సాల్మన్, కౌలురైతు, చింతలచెరువు, నూజెండ్ల మండలం.

నీటి సౌకర్యం ఉన్న 2 ఎకరాల పొలం కౌలుకు చేస్తున్నా. ప్రతి ఏడాది పచ్చిరొట్ట పైరు సాగు చేపట్టి తద్వారా ఎరువుల వినియోగం మోతాదు తగ్గించేవాడిని. భూసారం పెరిగి చీడ పీడల నుండి పైరు రక్షించుకోవడానికి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు రావడానికి పచ్చిరొట్ట పైరు సాగు చేస్తా. ప్రస్తుతం విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచాలి.

రోహిణి కార్తె ఆరంభం సాగుకు అదును

చేకూరి రామయ్య, ఎ.ముప్పాళ్ల గ్రామం, ఈపూరు మండలం.

రోహిణి కార్తె ఆరంభంలో పచ్చిరొట్ట సాగు అనువుగా ఉంటుంది.ఆగస్టు నాటికి భూమిలో సెప్టెంబర్ నెలలో ప్రధాన పంటలు సాగుకు అనువుగా ఉంటుంది. రోహిణి కార్తె రాగానే దుక్కి దున్ని పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకునేందుకు విత్తనాలను ఇప్పటికి అందుబాటు ఉంచినట్లయితే ఇప్పటికే సాగు చేపట్టడం జరిగేది. వర్షాలు కాస్త ముందుగా పడతాయని అంచనా ఉన్నప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో పచ్చిరొట్ట విత్తనాలను అందజేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన పూర్తి స్థాయిలో పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయాలి.

అవసరం మేరకు సరఫరా చేస్తాం

ఐ.మురళి, పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖాధికారి

ప్రధానంగా వరి సాగు చేపట్టే ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తూ పల్నాడు జిల్లాలో ఇప్పటికి 700 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయడం జరిగింది. ఎన్నికల నేపథ్యంలో పంపిణీ ప్రక్రియ కాస్త ఆలస్యం అయింది. మరో 4 రోజులలో 2500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయి. పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులెవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలుగు గుజాతి ముద్దుబిడ్డ, యుగపురుషుడు, సంక్షేమ పథకాల సృష్టికర్త నందమూరి తారక రామారావు అని టిడిపి డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎన్టీఆర్ 101వ జయంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి డాక్టర్ కడియాల పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కట్ చేశారు. అనంతరం డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సినీరంగంతో పాటు రాజకీయ రంగంలో తనదైన ముద్రను వేసుకుని ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న గొప్పవ్యక్తి ఎన్‌టిఆర్ అని కొనియాడారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో టిడిపిని స్థాపించి పేదలకు కూడు, గూడు ఏర్పరిచిన మహోన్నత వ్యక్తి అని టిడిపి నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గృహ నిర్బంధంలో ఉన్న అరవిందబాబు టిడిపి ముఖ్య నాయకుల సమక్షంలో తన ఇంట్లోనే ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో యువ నాయకులు డాక్టర్ చదలవాడ ఆదిత్య ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

ప్రజాశక్తి - వినుకొండ : ఆరు దశాబ్దాల వెండితెర నటప్రస్థానంలో ఎదురులేని రారాజు, సంచలన విజయాలు, సంక్షేమ పథకాలతో రాజకీయాల్లో నవశకానికి నాంది పలికిన యుగపురుషుడు ఎన్‌టిఆర్ అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి తన సతీమణి లీలావతితో కలసి పుష్పాంజలి ఘటించారు. తనను అభిమానించి, ఆదరించి ప్రజలకు సేవచేసి రుణం తీర్చుకోవడానికి ఎన్టీఆర్ రాజకీయాల్లో వచ్చారని, ఇక్కడా తెలుగువారి ఆత్మగౌరవ పతాకను ఎగరేసి కొత్త చరిత్రను లిఖించారని అన్నారు. రాజకీయాలపై అన్నివర్గాల్లో చైతన్యం, బడుగు, బలహీనవర్గాలకు అధికారం, అవకాశాలు, మహిళలకు హక్కులు, పేదలకు సంక్షేమంతోనే ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు చెప్పారు. టిడిపి వినుకొండ పట్టణ అధ్యక్షులు పఠాన్ ఆయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో వినుకొండలోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని చిత్రపటానికి పూలమాలేశారు. సినీ రాజకీయ చరిత్రలో ఎన్టీ రామారావు చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 20 మంది కళాకారులను సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన న్యాయవాది రామకోటేశ్వరరావు, గంగినేని రాఘవ మాట్లాడారు. అనంతరం అన్నదానం చేశారు. కవి కరిముల్లా, నేషనల్ అవార్డు గ్రహీత నాదస్వర కళాకారులు పి.సాయి, డి.నాగేశ్వరరావు, ఎం.రామయ్య, పల్నాటి యుద్ధం ఫేమ్ టి.నరసింహారావు, బిఎస్ఎన్ఎల్ రామకృష్ణ, రఘు, బాబురావు, రోశయ్య, ఆర్టీసీ డ్రైవర్ రాజేష్, సినీ సర్కార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు : పేదల పక్షపాతి ఎన్టీఆర్ అని టిడిపి మండల అధ్యక్షులు రమేష్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్‌టిఆర్ జయంతి నిర్వహించారు. అబ్బరాజుపాలెంలో అన్నదానం చేశారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : స్థానిక పండరీపురంలోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - క్రోసూరు : మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. జి.బాషా, వెంకట్రామిరెడ్డి, టి.వెంకట్రావు, వి.రాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అచ్చంపేట : మండల కేంద్రమైన అచ్చంపేటలోని టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యులు మొక్కపాటి గిరిబాబు నివాసంలో ఎన్టీఆర్ చిత్రపటానికి సంగం డైరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు పూలమాల వేశారు. చల్లా అనుపకళ, మాజీ జెడ్‌పిటిసి నల్లమేకల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సందీప్ వెంకయ్య నివాళులర్పించారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ విశేష కృషి చేశారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి యెలినేడి రామస్వామి అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్ ప్రజావేదికలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చౌట శ్రీనివాసరావు, ఎ.అమరేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల మండలం ఏకునంపేటలో టిడిపి నాయకులు పశుపులేటి బ్రహ్మనాయుడు, గుండాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేకు కట్ చేశారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మండల అధ్యక్షులు నల్లమేకల లక్ష్మీనారాయణ, సర్పంచి గడ్డిపర్తి జ్యోతి సముద్రం, నాయకులు టి.రామకృష్ణ, ఎ.వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ బ్రాహ్మణపల్లి షేక్ హుస్సేన్, మాజీ ఎంపీటీసీ టి.కిచారెడ్డి, ఇబ్రహీం, జబ్బర్, బోధటి సీతయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల : తెలుగు జాతి గర్వించదగ్గ నేత ఎన్‌టిఆర్ అని టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొమెర దుర్గారావు, బండ్ల శ్రీనివాసరావు, కంభంపాటి అనిల్‌కుమార్ అన్నారు. ఆ పార్టీ కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. కోమెర శివ, కొమెర అనంతరాములు, షేక్ జాని, వజ్రంనాయక్, నక్షత్రపు ప్రసాదు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : టిడిపి కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల : స్థానిక ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలే వేసి కేక్ కట్ చేశారు. షేక్ హకీం,షేక్ గంగారాం ఖాశీం,షేక్ మాబుసుభాని, కందుల మనోజ్, గనికపూడి శ్యాంసన్, నాము శివ, కాశీం, అంబేద్కర్, మౌలాలి, రఫీ, నాగుల్ మీరా, రవి, హనుమంతు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

విద్యాసంస్థల వాహనాలకు ఫిట్నెస్ పరీక్షలు ప్రారంభం

తెనాలి ఆర్టీవో పరిధిలో 5 మండలాలు, 350 వాహనాలు -100 వాహనాలకు ఫిట్నెస్ పరీక్షలు పూర్తి

ప్రజాశక్తి-తెనాలి

విద్యాసంస్థల వాహనాల ఫిట్నెస్ నిర్ధారణకు సమయం ఆసన్నమైంది. ప్రతి ఏటా వేసవి శలవుల్లో ఆయా సంస్థల వాహనాలకు రవాణా శాఖ ఆధ్వర్యంలో సామర్ధ్య పరీక్షలు నిర్వహిస్తారు. అదే విధంగా ఈ ఏడాది కూడా అధికారులు వాహనాల ఫిట్నెస్ పరీక్షలు చేపట్టారు. గతంలో కొన్ని చోట్ల పాఠశాలలు, కళాశాలలకు చెందిన వాహనాలు ప్రమాదాలకు గురైన సందర్భాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ధేశించిన ప్రకారం వేసవి శలవులు ముగిసేలోగా వాటికి ఫిట్నెస్ పూర్తిచేయాలన్న సంకల్పంతో అధికారులు చేపట్టిన కసరత్తు వివరాలను ఆర్టీవో కె.ప్రసాద్ వెల్లడించారు.

తెనాలి ఆర్టీవో పరిధిలో తెనాలి, కొల్లిపర, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను, మండలాలున్నాయి. ఆయా మండలాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు 350 వరకూ ఉన్నాయి. కళాశాలలు జూన్ మొదటి వారంలో, పాఠశాలలు జూన్ 12న పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించేందుకు వారం క్రితం ఆర్టీవో కె.రమేష్ విద్యాసంస్థల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. వాహనాల ఫిట్నెస్‌కు సంబందించి యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దానికి సంబందించి దాదాపు 32 నిబంధనలను వారికి వివరించారు. ప్రతి రోజు 20 నుంచి 30 వాహనాలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పరీక్షించేందుకు వీలుగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ ప్రకారం దాదాపు 100 వాహనాలకు ఫిట్నెస్ పరీక్షలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన వాటికి కూడా నిర్ధేశించిన గడువులోగా ఫిట్నెస్ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వాహనాల సామర్యాన్ని పరీక్షించే పనిలో ఆర్టీవోతో పాటు ఎంవిఐ టి. రాఘవరావు, ఎఎంవిఐ మధుసూధనరావు నిమగ్నమయ్యారు.

విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష జరుపుతున్న ఆర్టీవో(ఫైల్‌ఫోటో)

వాహన యాజమాన్యం విధిగా పాటించాల్సిన నిబంధనలు

రవాణాశాఖ నిబంధనల మేరకు వాహనాల యాజమాన్యం విధిగా పాటించాల్సిన నిబంధన లున్నాయి. వాటిలో ప్రధానంగా వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, టాక్స్‌ల చెల్లింపు వంటివి ఫోర్స్‌లో ఉండాలి. డ్రైవర్‌కు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. అలాగే డ్రైవర్ 60 సంవత్సరాల లోపు వయస్కుడై ఉండాలి. వాహనాన్ని నడిపే సమయంలో మద్యం సేవించి ఉండకూడదు. వాహనంలో సీటింగ్ కెపాసిటీ, వాహనం యొక్క కండిషన్ రవాణా శాఖ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. ఫిట్నెస్ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజులు చెల్లించి, వాహనానికి సంబందించిన పత్రాలతో పాటు ఫిట్నెస్ సర్టిఫికేట్ కూడా వాహనంలో అందుబాటులో ఉంచుకోవాలి. ఇలాంటి ప్రధానమైన నిబంధనలు పాటించాల్సిన అవసరం వాహన యాజమాన్యానికి ఉంది.

వాహనాన్ని పరిశీలిస్తున్న ఎంవిఐ రాఘవరావు

వాహనాలకు ఫిట్నెస్ పరీక్షలు తప్పనిసరి

కె.ప్రసాద్, ఆర్టీవో, తెనాలి

ఆర్టీవో ప్రసాద్

మా కార్యాలయం పరిధిలో ఐదు మండలాలున్నాయి. ఆయా మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సంబందించి దాదాపు 350 బస్సులు ఉన్నాయి. వాటికి ప్రతిఏటా రవాణా శాఖ నిబంధనల మేరకు ఫిట్నెస్ పరీక్షలు చేయించాల్సిందే. ఈ క్రమంలో విద్యాసంస్థల యజమాన్యానికి దిశానిర్ధేశం చేశాం. నిబంధనలను వివరించాం. ఆ ప్రకారం ఫిట్నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. దాదాపుగా 100 వాహనాలకు ఫిట్నెస్ పూర్తయింది. మిగిలిన వాటికి కూడా సకాలంలో ఫిట్నెస్ పరీక్షలు పూర్తి చేస్తాం. కాలం చెల్లిన వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం.

పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తి చేసి

26 వేల ఎకరాలకు సాగునీరివ్వాలి

ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైనవి అందుబాటులో ఉంచాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి

రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ వ్యవసాయ సీజన్లో రైతులకు కావలసిన అన్ని రకాల విత్తనాలు, సబ్సిడీ ఎరువులు, పచ్చిరొట్ట అందుబాటులోకి రైతులకు ఉంచాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ పూర్తి చేసి ఈ ప్రాంతంలో 26వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు ఛానల్, కొండవీటి వాగులో తోటు కాడ, చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంగా ఉంది, వెంటనే నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి కాల్వ మరమ్మతులు చేయాలని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, మంగళగిరి నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్ధి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ కు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు అన్ని వసతులు కల్పించాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, ఈమని అప్పారావు, తాడేపల్లి సిపిఎం పట్టణ కార్యదర్శి బురగ వెంకటేశ్వరావు, కాజా వెంకటేశ్వరావు, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, దుగ్గిరాల మండలం సిపిఎం కార్యదర్శి జె బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ఉద్యాన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి -పొన్నూరు

వాతావరణంపై ఆధారపడి కూరగాయ తోటలు సాగు చేస్తున్న రైతులకు ఖేదం మిగులుతుంది. సన్న, చిన్న కారు రైతులు మెట్ట భూముల్లో కూరగాయ తోటలు సాగు చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి.. స్వేదం చిందించి పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు నష్టాలు ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. అతివృష్టి, అనావృష్టితో కూరగాయ తోటలు రైతులు నిట్ట నిలువునా మునిగిపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగుచేసిన కూరగాయ తోటల పై ఆధారపడిన రైతులకు నిరాశ మిగులుతుంది. చెమటోడ్చి కష్టపడి పండించిన కూరగాయలకు ధరలు మధ్య దళారులు నిర్ణయించడంతో గిట్టుబాటు లేక రైతులు నష్టాల బారిన పడుతున్నారు. కూరగాయ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం , కౌలు రైతు కార్డులు జారీ చేయకపోవడం వల్ల బ్యాంకుల ద్వారా రుణాలు పొందలేకపోతున్నామని సన్న, చిన్న కారు రైతులు వాపోతున్నారు.

పొన్నూరు మండలంలో నిడుబ్రోలు, ఆలూరు, ఆ ఆరమండ, గాయంవారి పాలెం, మామిళ్ళపల్లి, దండమూడి, కట్టెంపూడి పరిసర ప్రాంతాలలో సుమారు 200 ఎకరాల్లో దోస తోటలు సన్న, చిన్న కారు రైతులు సాగు చేస్తున్నారు. ఈ వేసవిలో దోస తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత మూడు నెలల క్రితం సాగుచేసిన దోస తోటలకు ఎకరానికి 15 వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు. అలాగే కౌలు కింద రూ.30 వేలు అయ్యాని తెలిపారు. దోస తోటల్లో నాలుగు రోజులకు ఒకసారి ఆరు తడులు పెట్టి కోత కోస్తామని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం నెల రోజుల నుండి 60 కిలోల దోస టిక్కీ రూ.1000 ధర పలుకుతుందని రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రకృతిపై ఆధారపడి సాగు చేస్తున్న కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఈ ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దోస పాలం

రుణాలిచ్చి ఆదుకోవాలి

డక్కుమళ్ల బాబురావు, కౌలు రైతు

కౌలు రైతు బాబురావు మాట్లడుతు కూరగాయలు తోటలు సాగుచేసే కౌలు రైతులకు జాతీయ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం రుణ కల్పించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలవల్ల నష్టపోయిన సన్న, చిన్న కారు రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

పాలపర్రులో రేపు మృతవీరుల స్మారక సభ

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

పాత బాపట్ల తాలూకా మృత వీరుల స్మారక సభ 30 వ తేదీ ఉదయం 9 గంటలకు పాలపర్రు గ్రామంలో జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ సభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. గత 42 సంవత్సరాలుగా పాలపర్రులో మృతవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. మృతవీరుల్లో పాలపర్రుకు చెందిన ఎనిమిది మంది అమరులు ఉన్నారని తెలిపారు. గురువారం ఉదయం నిర్వహించే సభలో వామపక్ష నాయకులు, అభిమానులు పాల్గొనాలని రమేష్‌బాబు కోరారు.

పోస్టర్ ఆవిష్కరణలో గురునాథ్, శ్రీనివాసరావు తదితరులు

నేడు వైష్ణవిలో హెచ్‌సిఎల్ జాబ్‌మేళా

ప్రజాశక్తి - తెనాలి

ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీ హెచ్‌సిఎల్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కంపెనీ కోఆర్డినేటర్ పి గుర్నాథ్ మంగళవారం చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో గురునాథ్ మాట్లాడుతూ 2023 మార్చి, 2024 మార్చి లో ఇంటర్ బైపిసి, సిఇసి, హెచ్‌ఈసిలో 75% కు పైబడి మార్కులు సాధించిన వారు జాబ్ మేళాకు అర్హులని చెప్పారు. ఎంపిక ప్రక్రియ మూడు దశలలో ఉంటుందని, ఎంపికైన వారికి తొలి ఏడాదిలో తొమ్మిది నెలల పాటు నెలకు రూ.10వేల స్టైఫండ్తో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.14,500 ప్రారంభ వేతనంతో కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు. అలాగే జాబ్ చేస్తూనే పేరొందిన యూనివర్సిటీలలో డిగ్రీ చదువుకునేందుకు కంపెనీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 7780754278, 9866607774 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు. సమావేశంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన కెఎల్‌యు విద్యార్థిని షబీనాకు ఫీజు రాయితి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఫవర్ లిఫ్టింగ్‌లో వరుసగా నాలుగు బంగారు పతకాలు సాధించిన షేక్ షబీనా అనే విద్యార్థినికి వంద శాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేది నుండి 11 వరకు హాంకాంగ్ లో జరిగిన ఎషియన్ ఫవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ లో స్కాట్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ అనే మూడు రకాల పోటీలతో పాటు మరో పోటీలో కలిపి మొత్తం నాలుగు బంగారు పతకాలు సాదించి రికార్డు సృష్టించిన షేక్ షబీనా తమ వర్శిటీలో బిబిఎ మొదటి సంవత్సరం చదువుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షేక్ షబీనాను అభినందించిన వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ లు షబీనాకు వంద శాతం ఫీజు రాయితీని ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.పార్ధసారధివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్ తదితరులకు షేక్ షబీనాకు అభినందనలు తెలిపారు.

వర్ధమాన సినీ నటి టీనాకు వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్

ప్రజాశక్తి - తెనాలిరూరల్

సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ నుంచి వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకుంటున్న టీనా చౌదరి

తెనాలికి చెందిన వర్ధమాన సినినటి టీనా చౌదరి లిటిల్ చాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకోవడం ముదావహమని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. లిటిల్ చాంప్స్ అకాడమి ప్రధానం చేసిన వరల్డ్ రికార్డ్ పత్రాన్ని మంగళవారం తన కార్యాలయంలో టీనా చౌదరికి అందజేశారు. కూచిపూడి కళాకారిణిగా, నటిగా టీనా చౌదరి మరెన్నో విజయాలు సాధించాలని ప్రఖర్ జైన్ అభినందనలు తెలిపారు. మా ఎపి అధ్యక్షుడు, సినీ దర్శకులు దిలీప్ రాజా మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని అంచెలంచెలుగా కూచిపూడి నృత్యకళాకారిణిగా టీనా చౌదరి గుర్తింపు పొందారన్నారు. మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎపి, తమిళనాడు, మిజోరాం గవర్నర్ ల ప్రశంసలు అందుకున్న టీనా చౌదరి తెనాలి పట్టణానికే గర్వకారణమన్నారు. మా ఎపి లో సభ్యురాలైన టీనా భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. నృత్య విభాగంలో తనకు వరల్డ్ రికార్డ్ సెర్టిఫికేట్ లభించినట్లు టీనా చౌదరి విలేఖర్లతో చెప్పారు. కార్యక్రమంలో టీనా తల్లితండ్రులు మన్నె సత్యన్నారాయణ, శివకుమారి, సహాయ దర్శకులు ఇంటూరి విజయ్ భాస్కర్, వెంకీ రావణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పవన్

1న పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని జూన్ 1వ తేదీన విద్యుత్ శాఖ గుంటూరు టౌన్-1 ఈఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.పవన్ తెలిపారు. మంగళవారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పవన్ మాట్లాడుతూ ధర్నాకు విద్యుత్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సెలవు దినాల్లో కూడా పనిచేసినందుకు వేతనాలు ఇవ్వాల్సి ఉండగా గత ఐదేళ్ల నుండి ఇవ్వకపోగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తక్షణమే చెల్లించమని కార్పొరేట్ ఆఫీస్ నుంచి ఆదేశాలున్నా చెల్లించకపోవడం కాంట్రాక్ట్ కార్మికులు పట్ల చిన్నచూపు అని అన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు కలుగజేసుకొని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, పెయిడ్ హాలిడేస్ వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి జి.నాగరాజు, కోశాధికారి కె.రాంబాబు జిల్లా నాయకులు మురికిపూడి రవి, బత్తుల రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్ఎంలు, ఆశాలకు ఎన్నికల అలవెన్స్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

వినతిపత్రం ఇస్తున్న నాయకులు వై నేతాజీ తదితరులు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద మెడికల్ క్యాంపుల నిర్వహణలో విధులు నిర్వర్తించిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అలవెన్స్ ఇవ్వాలని డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులందరికీ అలవెన్సులు చెల్లిస్తుంటే ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు మాత్రం చెల్లించట్లేదన్నారు.ఎన్నికలకు ముందే జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్‌కు ఈ విషయమై వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. . పలనాడు జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఏఎన్ఎంలు ఆశ వర్కర్లకు ఒక్కొక్కరికి రూ.500ల చొప్పున అలవెన్సులు చెల్లించడం జరిగిందని, గుంటూరు జిల్లాలో ఇంతవరకు అలవెన్స్ చెల్లించలేదని అన్నారు. కావున తక్షణమే ఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఎన్నికల అలవెన్స్ చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డిఎంహెచ్ఓ స్పందిస్తూ జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం పంపి అలవెన్సులు చెల్లించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై నేతాజీ, జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మి, జిల్లా కోశాధికారి ఎస్.లక్ష్మి, జిల్లా నాయకులు రేణుక, జ్యోతి, ప్రమీల పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బందికి కొనసాగుతున్న శిక్షణ

మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఓట్ల లెక్కింపు విధులు కేటాయించిన ఉద్యోగులు బాధ్యతగా జిల్లాలోని సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఓట్ల లెక్కింపు విధులు కేటాయించిన ఉద్యోగులకు సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో జరిగే కౌంటింగ్‌లో ప్రతి నియోజకవర్గానికి, సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా 14 టేబుళ్ళు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జూన్ మూడవ తేదిన జరిగే రెండవ ర్యాండమైజేషన్‌లో కౌంటింగ్ సిబ్బందికి అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించటంతో పాటు ఈవియం , పోస్టల్ బ్యాలెట్ ల కౌంటింగ్ విధులు కేటాయించటం జరుగుతుందన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు జూన్ 4వ తేది ఉదయం 5.00 గంటల సమయానికి ఖచ్చితంగా ఆచార్య నాగర్జున యూనివర్సిటీకి చేరుకోవాలన్నారు. సమావేశంలో ఈవీఎంలకు సంబంధించి కంట్రోల్ ప్యానెల్‌లోని ఫలితాలు వెల్లడించేందుకు నిర్వహించే ప్రక్రియ, కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించాల్సిన విధులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయిలో శిక్షణ అందించారు. సమావేశంలో జేసీ, మంగళగిరి రిటర్నింగ్ అధికారి జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్ఓ పెద్దిరోజా, గుంటూరు పశ్చిమ ఆర్ఓ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం ప్రభుత్వ సర్వే

ప్రజాశక్తి-గుంటూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడిలో చేర్పించాలనే ఉద్దేశంతో సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా ప్రాజెక్టు సహిత విద్యా విభాగము సర్వే చేపట్టింది. సరైన అవగాహన లేక, ఇంటికే పరిమితమై చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించటానికి సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల సహిత విద్యా విభాగం సిబ్బంది (ఐఈఆర్‌పిలు) గ్రామ సచివాలయాల్లో ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో ఎడ్యుకేషన్ సెక్రెటరీలు, అంగన్వాడీల సహకారంతో ఇంటింటికి వెళ్లి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంబంధించి గుర్తింపు చేపట్టటం జరుగుతుంది. ఈనెల ఒకటవ తేదీన ప్రారంభమైన సర్వే జూన్ 9వ తేదీ వరకూ కొనసాగుతుంది. ఇప్పటివరకు బడికి మధ్యలో దూరమైనవారి వివరాలతోపాటు, నూతనంగా నమోదుకు అవకాశం ఉన్న 700 మంది పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. వీరి తల్లిదండ్రులకు విద్యవల్ల ప్రయోజనం గురించి వివరిస్తూ అవగాహన కల్పించడం జరుగు తుందని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల గురించి వారికి తెలియజేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడిలో చేర్పించడం వల్ల వారికి వివిధ రకాల అలవెన్సులు, ఉచిత ఉపకరణాలు పొందే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వారికి వివిధ రకాల అలవెన్స్‌లు పొందే అవకాశం ఉంది అని, అలాగే టిఎల్‌ఎం టిఎల్‌ఎం కిట్స్ ని ఇవ్వడం జరుగుతుంది అని, ఎస్కార్ట్ , ట్రాన్స్పోర్ట్ , రీడర్ అలవెన్స్ పొందే అవకాశం ఉంది అని ఎపిసి విజయలక్ష్మి తెలిపారు. కావున సర్వే నిర్వహిస్తున్న సహిత విద్య రిసోర్స్ సిబ్బంది అందరికీ సహకారం అందించి సమాచారం ఇవ్వాలని, ఇంకా బడిలోలేని పిల్లలను నమోదు చేయాలని ఆమె తెలియజేశారు.

సర్వే చేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ

అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌ను వినియోగించుకోండి

డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌ను వినియోగించుకొని 2025 నాటికి టిబి ముక్త భారత్‌కు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ కోసం రాష్ట్రంలోని పైలెట్‌గా ఎంపికైన 12 జిల్లాలో గుంటూరు కూడా ఒకటని చెప్పారు. ఈ వ్యాక్సిన్ పట్ల ఎలాంటి అపోహలూ పెట్టుకోవద్దన్నారు. ప్రతి గురువారం సచివాలయాల్లో నిర్దేశించిన కేటగిరీ వ్యక్తులకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకూ ఈ వ్యాక్సిన్ ఇవ్వటం జరుగుతుందన్నారు. పిల్లలకు బిసిజి వ్యాక్సిన్ వేయటం వల్ల వారికి టిబి రావట్లేదని, కానీ పెద్దవారిలో వస్తుందని, అందుకే పెద్ద వారికి అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, గత 5 ఏళ్లలో క్షయ వ్యాధికి గురైన వారు, షుగర్‌బాధితులు, ధూమపానం చేసే వారు, 2021 జనవరి 1 నుండి టిబి వ్యాధి గ్రస్తులతో సన్నిహితంగా ఉన్న వారు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కెజిల కన్నా తక్కువగా ఉన్న వారు మాత్రమే ఈ వ్యాక్సిన్‌కు అర్హులని తెలిపారు. జిల్లాలో 5, 83, 604 మంది అర్హులను గుర్తించామని, వారంతా సచివాలయాల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఇంగ్లీషు అధ్యాపకులు యు.పాలప్రసాద్ ఇంగ్లీషు భాష ఉచ్చారణ, ప్రిపోజిషన్స్ గురించి పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. అనంతరం పిల్లలకు దాతల సహకారంతో తినుబండారాలు అందించారు. మ్యూజికల్ చైర్స్ ఆడించారు. కార్యక్రమంలో గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న పాలప్రసాద్